


## హైదరాబాద్‌లో ఓపెన్ టెక్స్ట్ నూతన ఆఫీస్

హైదరాబాద్, జూన్ 11: ఐటీ సేవల సంస్థ ఓపెన్ టెక్స్ట్.. హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని ఫోనిక్ టెక్ జోన్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన ఆఫీస్‌లో ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచుకుంటున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ముహి మజూబ్ తెలిపారు. వ్యాపార విస్తరణలో భాగంగానే కొత్త ఆఫీస్ తెచ్చామని, దీంతో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ బలోపేతం కాగలదన్నారు. 2010 నుంచి హైదరాబాద్ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థకు బెంగళూరు, చెన్నైలతో కలుపుకొని మొత్తంగా 6 వేల మంది సిబ్బంది ఉన్నారు.

# నెలకు 3.15 కోట్ల అద్దె

## హైటెక్ సిటీలో 4.14 లక్షల చ.అడుగుల్లో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్న క్వాల్‌కామ్

### మరో మూడు కంపెనీల చేతికీ 4.56 లక్షల ఎస్‌ఎఫ్‌టీ

### అగ్రశ్రేణి సంస్థల నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు గిరాకీ


హైదరాబాద్, జూన్ 11: నాలుగు డీల్స్.. మూడు కోట్ల అద్దె.. రెండు ప్రాంతాలు.. ఒక్క నగరం. ఇదీ.. హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌కు అగ్రశ్రేణి బహుళజాతి సంస్థల నుంచి వస్తున్న డిమాండ్‌కు సంక్షిప్త రూపం. క్వాల్‌కామ్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఐబీఎం, ఎస్‌అండ్‌పీ క్యాపిటల్ ఐక్యూ సంస్థలు.. నగర ఐటీ హబ్‌లు హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో 8.7 లక్షల చదరపు అడుగుల (ఎస్‌ఎఫ్‌టీ) ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయి. ఇటీవలే పూర్తయిన డీల్స్, ప్రాప్‌స్టాక్ వివరాల ప్రకారం వీటి నెలవారీ అద్దెలు కనిష్ఠంగా రూ.70 లక్షలు, గరిష్ఠంగా రూ.3 కోట్లపైనే ఉండటం గమనార్హం.

**క్వాల్‌కామ్ 4.14 లక్షలు**

హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన సెమీ కండక్టర్, సాఫ్ట్‌వేర్ దిగ్గజం క్వాల్‌కామ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 4.14 లక్షల చదరపు అడుగులకుపైగా కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకున్నది. నెలకు దీని అద్దె రూ.3.15 కోట్లు. స్కైవ్యూ బిల్డింగ్‌లో 18 నుంచి 22 వరకున్న 5 ఫ్లోర్లు క్వాల్‌కామ్ ఇండియావే. ఈ ఏడాది ఫిబ్రవరి 12 నుంచే లీజు మొదలవగా, ఐదేండ్లపాటు ఉంటుంది. ఇక ఈ ఆఫీస్ స్పేస్ కోసం సెక్యూరిటీ డిపాజిట్‌గా కంపెనీ రూ.16.4 కోట్లు చెల్లించింది. లీజు డాక్యుమెంట్ల ప్రకారం తొలి ఏడాది ముగిశాక అద్దె 7 శాతం పెరుగుతుంది. అలాగే 15 ఏండ్ల తర్వాత 15 శాతం ఎక్కువవుతుంది. ఈ మేరకు ఆర్‌ఎంజెడ్ గ్రూప్‌లో భాగమైన దివిజ కమర్షియల్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో క్వాల్‌కామ్ డీల్ చేసుకున్నది.

**ఎస్‌అండ్‌పీ 2.41 లక్షలు**

అమెరికాకు చెందిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రిసెర్చ్ డివిజన్.. ఎస్‌అండ్‌పీ క్యాపిటల్ ఐక్యూ ఇండియా హైటెక్ సిటీలోని స్కైవ్యూలోనే 2.41 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నది. నెలకు దీని అద్దె రూ.1.77 కోట్లు. లీజు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే ఆరంభమవగా, సెక్యూరిటీ డిపాజిట్‌గా సంస్థ రూ.10.6 కోట్లు చెల్లించింది. స్కైవ్యూలో 19 నుంచి 21 వరకు మూడు ఫ్లోర్లు ఎస్‌అండ్‌పీ క్యాపిటల్‌వే. లీజు కాలవ్యవధి ఐదేండ్లు. లీజు డాక్యుమెంట్ల ప్రకారం రెండేండ్ల తర్వాత అద్దె 15 శాతం పెరుగుతుంది. ఈ మేరకు దివిజ కమర్షియల్ ప్రాపర్టీస్‌తో ఎస్‌అండ్‌పీ క్యాపిటల్ డీల్ చేసుకున్నది.



*హైదరాబాద్ పశ్చిమ ప్రాంతంలో ఆఫీస్ స్పేస్ మార్కెట్ భారీగా విస్తరించింది. మునుపెన్నడూ లేనివిధంగా గత కొన్నేండ్లు ఇక్కడ బలమైన వృద్ధి కనిపించింది. దేశ, విదేశీ సంస్థల రాకతో ఒక్కసారిగా కార్యాలయ స్థలాలకు డిమాండ్ గరిష్ఠ స్థాయిలను తాకింది. భారత్‌లో విస్తరించే బహుళజాతి కంపెనీల చూపు హైదరాబాద్‌పైనే పడింది. ఇక 2021 నుంచి ఈ ఏడాది మార్చిదాకా హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్‌లో బ్రహ్మాండమైన వృద్ధి నమోదైంది. ఈ మూడేండ్లకుపైగా కాలంలో మొత్తం దాదాపుగా 2,18,800 కొత్త నివాసాల నిర్మాణం జరిగింది. అందులో 1,54,300 యూనిట్లు అమ్ముడైపోయాయి. ఒక్క 2023లోనే సుమారు 76,300 ఇండ్లు అందుబాటులోకి రాగా, 61,700 ఇండ్ల అమ్మకాలు జరిగాయి. సగటున ఇండ్లపై పెట్టుబడుల విలువ 52 శాతం పెరిగింది. ఇదే క్రమంలో చదరపు అడుగు ధర కూడా రూ.7,200 పలికింది. మొత్తంగా గత మూడేండ్లలో ఇక్కడి భూముల ధరలు 30 శాతంపైనే పెరిగాయి.*

***-ప్రశాంత్ ఠాకూర్, అనరాక్ గ్రూప్ రిసెర్చ్ ప్రాంతీయ డైరెక్టర్***

**ఎల్‌టీఐమైండ్‌ట్రీ 1.09 లక్షలు**

భారతీయ ఐటీ సేవల సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ లిమిటెడ్ సైతం హైటెక్ సిటీలోని స్కైవ్యూ భవనంలో 1.09 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నది. నెలవారీ అద్దె రూ.89.18 లక్షలు. స్కైవ్యూలోని 14, 15 ఫ్లోర్లు మైండ్‌ట్రీవే. సెక్యూరిటీ డిపాజిట్‌గా 6.2 కోట్లు చెల్లించింది. గత నెల మే 1 నుంచే లీజు మొదలవగా, ఐదేండ్లపాటు ఉంటుంది. దివిజ కమర్షియల్ ప్రాపర్టీస్‌తో జరిగిన లీజు డాక్యుమెంట్ల ప్రకారం ఏటా అద్దె 5 శాతం పెరుగుతున్నది.

**ఐబీఎం 1.06 లక్షలు**

గచ్చిబౌలిలోని దివ్యశ్రీ ఓరియన్‌లో అమెరికాకు చెందిన ఐటీ దిగ్గజం ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 1.06 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నది. నెలవారీ అద్దె రూ.70.23 లక్షలు. 26 ఎకరాల్లో విస్తరించిన ఈ క్యాంపస్‌లో 10, 11 ఫ్లోర్లు ఐబీఎం ఇండియావే. ఇక ఈ కార్యాలయ స్థలం కోసం ఐబీఎం.. సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.4.21 కోట్లు చెల్లించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచే లీజు మొదలవగా, ఐదేండ్లపాటు ఉంటుంది. లీజు డాక్యుమెంట్ల ప్రకారం ఆ తర్వాత అద్దె 4 శాతం పెరుగుతుంది. ఈ మేరకు మైదాస్ ప్రాజెక్ట్స్‌తో ఐబీఎం ఇండియా ఒప్పందం చేసుకున్నది.

## హైదరాబాద్‌లో రియల్టీ బూమ్

తెలంగాణ రాష్ట్ర విభజనకు ముందు సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి పాలకుల నిర్లక్ష్య ధోరణితో అంతంతమాత్రంగానే సాగిన హైదరాబాద్ అభివృద్ధి.. స్వరాష్ట్రంలో రాకెట్ వేగాన్ని అందుకున్నది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు, దూరదృష్టితో ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు పెద్ద ఎత్తున విస్తరించాయి. ఇందుకు తగ్గట్టుగానే నాటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధతో అంతటా మెరుగైన మౌలిక వసతుల కల్పన జరిగిందని ఐటీ, నిర్మాణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా యావత్తు వ్యాపార వ్యవస్థలో నెలకొన్న ఉత్సాహంతో నివాస, వాణిజ్య స్థలాలకు డిమాండ్ పెరిగిందన్నారు.

## స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో హైదరాబాద్‌కు గుర్తింపు

హైదరాబాద్, జూన్ 11: స్టార్టప్ ఎకోసిస్టమ్ నిర్వహించడంలో ఆసియాలోని అగ్రశ్రేణి నగరాల జాబితాలో హైదరాబాద్ నిలిచింది. పని తీరు, నిధులు, ప్రతిభ, అనుభవం, మార్కెట్లోకి అందుబాటులోకి రావడం ఐదు వర్టికల్ ఆధారంగా '2024 గ్లోబల్ స్టార్టప్ ఎకోసిస్టమ్ రిపోర్ట్'ను అమెరికాకు చెందిన స్టార్టప్ రీసర్చ్ సంస్థ స్టార్టప్ జినోమ్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. 100 దేశాలకు చెందిన 300 నగరాల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా సంస్థ ఈ నివేదికను రూపొందించింది. ఈ జాబితాలలో హైదరాబాద్‌కు 19వ స్థానం లభించింది. దీంతోపాటు మరో ఐదు నగరాలైన ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, పుణెలకు కూడా చోటు లభించింది. 2014లో హైదరాబాద్‌లో 200 స్టార్టప్‌లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 7,500కి పైకి చేరుకున్నాయని, స్టార్టప్‌ల ప్రారంభంలో టీ హబ్ కీలక పాత్ర పోషిస్తున్నదని, ఆయా సంస్థలకు ఆర్థిక వనరులు కల్పించడం కూడా ఆవశ్యకమని టీ హబ్ సీఈవో శ్రీనివాస్ రావు తెలిపారు.

## ఓలా ఐపీవోకి గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 11: ఓలా ఎలక్ట్రిక్..ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలిసారి స్టాక్ మార్కెట్లోకి అడుగుపెడుతున్న ఈ సంస్థ ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్) రూట్‌లో విక్రయించనుండటంతో రూ.5,500 కోట్ల నిధులు సేకరించాలనుకుంటున్నది.

## పత్రాల్లేవని క్లెయిమ్ ఆపొద్దు

### జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఐఆర్డీఏఐ మాస్టర్ సర్క్యులర్

న్యూఢిల్లీ, జూన్ 11: కావాల్సిన పత్రాలు లేవంటూ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు పాలసీదారుల క్లెయిమ్‌లను తిరస్కరించరాదని బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ మంగళవారం స్పష్టం చేసింది.



అవసరమైన పత్రాలను క్లెయిమ్ ప్రతిపాదనను పూర్తి చేస్తున్న సమయంలోనే అడుగాలన్నది. అయితే క్యాష్‌లెస్ సదుపాయం అందుబాటులో లేకపోతే క్లెయిమ్ సెటిల్మెంట్‌కు సంబంధించిన లేదా అవసరమైన పత్రాలను ముందుగానే అడుగవచ్చన్నది. ఈ మేరకు ఓ మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. జనరల్ ఇన్సూరెన్స్ వ్యాపారంపై ఇచ్చిన ఈ సమగ్ర మాస్టర్ సర్క్యులర్‌తో గత 13 సర్క్యులర్‌లు రద్దైపోయాయి. ఇక క్లెయిమ్‌లను బీమా కంపెనీలు వేగంగా పరిష్కరించాలని, సర్వేయర్ల నియామకం, వారి నివేదికల సమర్పణ చకచకా జరిగిపోవాలని కూడా ఐఆర్డీఏఐ ఆదేశించింది. సమయానికి సర్వే రిపోర్టులను పొందడం బీమా సంస్థల బాధ్యతన్నది. పాలసీదారులకు వారు తీసుకున్న బీమాకు సంబంధించిన పూర్తి అవగాహన కోసం కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ ఇవ్వాలని, అందులో బీమా కవరేజీ, మినహాయింపులు, వారంటీలు, క్లెయిమ్ పరిష్కార ప్రక్రియ వంటివి వివరంగా ఉండాలని ఈ సందర్భంగా బీమా సంస్థలకు ఐఆర్డీఏఐ సూచించింది.

**మాస్టర్ సర్క్యులర్ ముఖ్యాంశాలు**

- బీమా సంస్థకు తెలిపి రిటైల్ కస్టమర్లు ఎప్పుడైనా పాలసీని రద్దు చేసుకోవచ్చు.
- పాలసీదారుడు మోసం చేసినట్టు గుర్తిస్తేనే పాలసీని బీమా సంస్థ రద్దు చేయవచ్చు.
- పాలసీ వ్యవధి తీరకపోతే మిగిలిన కాలానికి సంబంధించిన ప్రీమియంను రద్దు చేసుకున్న పాలసీదారునికి బీమా సంస్థ తిరిగి చెల్లించాలి.
- మోటర్ ఇన్సూరెన్స్ కొనుగోలుదారులకు 'పే యాజ్ యూ డ్రైవ్' ఆప్షన్ ఇవ్వాలి.
- గృహ యజమానుల అగ్ని ప్రమాద పాలసీకి వరదలు, తుఫాన్, భూకంపం, కొండ చరియలు విరిగిపడటం, తీవ్రవాదం తదితర యాడ్ ఆన్ కవరేజీలను ఎంచుకునే వెసులుబాటు.

## సెబీ.. ఇన్వెస్టర్ సర్టిఫికేషన్ పరీక్ష

న్యూఢిల్లీ, జూన్ 11: క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. మంగళవారం ఓ ఉచిత, స్వచ్ఛంద ఆన్‌లైన్ ఇన్వెస్టర్ సర్టిఫికేషన్ ఎగ్జామినేషన్‌ను ప్రారంభించింది. స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి సమగ్ర రీతిలో విజ్ఞానాన్ని పొందడం కోసం ఇది ఉపకరించనున్నది. మరోవైపు 49 మంది ఆఫీసర్ స్థాయి ఉద్యోగులను నియమించుకోవడానికి సెబీ దరఖాస్తులను ఆహ్వానించింది. జనరల్, లీగల్, ఐటీ, ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్, రిసెర్చ్ తదితర విభాగాల్లో నియామకాలుంటాయి. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వచ్చే నెల 27 నుంచి 3 దశల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

## 45 నిమిషాల్లో ఎంఎస్‌ఎంఈలకు రుణం

- **ప్రత్యేక ప్రణాళికను ప్రకటించిన ఎస్బీఐ**

ముంబై, జూన్ 11:దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) కీలక నిర్ణయం తీసుకున్నది. నిధులు లేక సతమతమవుతున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు కేవలం 45 నిమిషాల్లో రుణం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. చిన్న స్థాయి రుణాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఎస్‌ఎంఈ (చిన్న, మధ్యతరహా సంస్థలు) డిజిటల్ బిజినెస్ లోన్ల పేరుతో ప్రత్యేక ప్రొడక్ట్‌ను విడుదల చేసింది. ఈ ప్లాన్ కింద ఎంఎస్‌ఎంఈలకు కేవలం 45 నిమిషాల్లో రుణాన్ని మంజూరుకానున్నదని తెలిపింది. చిన్న వ్యాపారాలకు రుణాన్ని సులభంగా అందించడానికి పలు కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. మార్చి 31తో ముగిసిన ఏడాదికిగాను బ్యాంక్ ఎస్‌ఎంఈలకు రూ.4.33 లక్షల కోట్ల రుణాలను మంజూరు చేసింది. రుణాన్ని తీసుకునే చిన్న స్థాయి సంస్థలు ఐటీఆర్, జీఎస్టీ రిటర్నులు, బ్యాంక్ లావాదేవీలకు సంబంధించిన సమాచారం ఇస్తే సరిపోతున్నది. ఇలా ఇచ్చిన సమాచారం తర్వాత కేవలం 10 సెకండ్లలోనే రుణానికి సంబంధించిన మంజూరు అయ్యే సమాచారం ఇవ్వనున్నట్లు ఇందుకోసం ప్రత్యేక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.50 లక్షల వరకు ఎంతైనా రుణం తీసుకునే అవకాశం కల్పించింది.

## రాంకీ ఇన్‌ఫ్రాకు ఫిక్కీ స్మార్ట్ అవార్డు

హైదరాబాద్, జూన్ 11: రాంకీ ఇన్‌ఫ్రా లిమిటెడ్‌కు..ఫిక్కీ స్మార్ట్ అర్బర్ ఇన్నోవేషన్ అవార్డు 2024 వరించింది. హైదరాబాద్‌లోని జవహర్ నగర్‌లో ఉన్న లెగసీ లీచేట్ శుద్ధి యూనిట్ గణనీయమైన వృద్ధిని గుర్తింపులో భాగంగా సంస్థకు ప్రస్తుతేడాదికిగాను 'సస్టెయినబుల్ సిటీస్' విభాగంలో ఈ అవార్డు లభించింది. ఢిల్లీలో ఇటీవల జరిగిన ఏడో ఎడిషన్ స్మార్ట్ అర్బన్ ఇన్నోవేషన్ అవార్డు కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు కోసం రాంకీతోపాటు 10 ఆర్గనైజేషన్లు, ముఖ్యంగా కార్పొరేట్లు, ప్రభుత్వ ఏజెన్సీలు, ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్లు పోటీపడ్డాయి. వ్యర్థాలు కుళ్లిపోవడం వల్ల వచ్చే విషపూరితమైన పదార్థాలతో సమీపంలోని నీటి వనరులతోపాటు భూగర్భ జలాలు కూడా కలుషితం కావడం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పువాటిల్లే అవకాశం ఉన్నదని పేర్కొంది. దీనిని నివారించడానికి రాంకీ 2 వేల కేఎల్‌డీ లీచేట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఇక్కడే నిర్వహిస్తున్నది.